సాక్షి రాజన్న సిరిసిల్ల

ఆదివారం | 17 | సెప్టెంబర్ | 2023





న్యూస్‌రీల్

స్వచ్ఛత లీగ్‌లో సత్తా చాటుదాం



స్వచ్ఛత లీగ్ ర్యాలీలో చైర్‌పర్సన్ కళ, కమిషనర్ ఆయాజ్

సిరిసిల్లటౌన్: వరుసగా జాతీయస్థాయిలో స్వచ్ఛ సిరిసిల్లగా అవార్డులు అందుకుంటున్న పట్టణాన్ని స్వచ్ఛత లీగ్‌– 2.0లోనూ సత్తా చాటుదామని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ కోరారు. స్వచ్ఛభారత్ మిషన్ అర్బన్ 2.0 ద్వారా చెత్తరహిత నగరాలను నిర్మించేందుకు ఇండియన్ స్వచ్ఛత లీగ్‌–2.0 కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. సిరిసిల్లలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి బతుకమ్మఘాట్ వరకు అవగాహన ర్యాలీ చేపట్టిన సందర్భంగా మాట్లాడారు. పట్టణంలో కొన్ని బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పడేసే ప్రాంతాలను గుర్తించి అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెత్తను ఇష్టానుసారం పడేసే వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. తడి, పొడి, ప్రమాకర చెత్తలను వేర్వేరుగా అందిస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఎండీ ఆయాజ్, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటుహక్కు వజ్రాయుధం



మాట్లాడుతున్న మధుసూదన్

వేములవాడఅర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని, 18 ఏళ్లు నిండిన యువత తప్పనిసరిగా ఓటుహక్కు నమోదు చేసుకోవాలని వేములవాడ ఆర్డీవో మధుసూదన్ కోరారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జిల్లా స్వీప్, కళాశాల జాతీయ సేవా పథకం సంయుక్తంగా ఓటరు నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపాల్ తిరుకోవెల శ్రీనివాస్, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, మధు రాజేశ్, మల్లారెడ్డి, రాజేశ్, నారాయణ, మధు బాబు, దీపిక, అర్జున్ ఉన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



మాట్లాడుతున్న లక్ష్మీరాజం

వేములవాడఅర్బన్: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా బాలింతలు, గర్భిణులు, పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం పేర్కొన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందిస్తుందని తెలిపారు. వేములవాడ పట్టణం న్యూ అర్బన్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణమాసోత్సవం నిర్వహించారు. సీడీపీవో సుచరిత, కో–ఆర్డినేటర్ బాలకృష్ణ, అంజలి, దేవిక, త్రివేణి, రాజు తదితరులు ఉన్నారు.

పాఠశాలలో అల్పాహారం



విద్యార్థులతో డీఈవో రమేశ్‌కుమార్

వేములవాడరూరల్: ఒకటి నుంచి పదో తరగతి వరకు అల్పాహారం ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో వేములవాడ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం పిల్లలకు అల్పాహారం అందించారు. కోనాయపల్లి వార్డులోని ప్రభుత్వ పాఠశాలలో డీఈవో రమేశ్‌కుమార్, ఎంఈవో భన్నాజీ, కౌన్సిలర్ గడ్డమీది లావణ్య హాజరై చిన్నారులకు అల్పాహారం అందజేశారు. అలాగే హన్మాజిపేట, చెక్కపల్లి, ఎదురుగట్లలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

రాజన్న ఆలయానికి ఆటో



వేములవాడ: రాజన్న ఆలయానికి తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా రూ.3.82 లక్షల విలువైన ట్రాలీ ఆటోను శనివారం ఆలయ ఈవో కృష్ణప్రసాద్‌కు బ్యాంకు అధికారులు అందజేశారు. ఏఈవోలు హరికిషన్, ప్రతాప నవీన్, పర్యవేక్షకులు శ్రీరాములు, సంతోష్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు

తిరగబడ్డ పోరుగడ్డ..

- నిజాంకు ఎదురొడ్డి నిలిచిన పల్లెలు
- వెట్టిని ఎదిరించిన విముక్తి పోరాటం
- నిజాం గుండెల్లో ఫిరంగులు మోగించిన యోధులు
- అమరుల త్యాగఫలంతో స్వేచ్ఛావాయువులు

'బండెనక బండి కట్టి.. పదహారు బండ్లు కట్టి.. ఏ బండ్లేబోతవు కొడుకో నైజాం సర్కరోడా.. నాజీల మించినవురో.. నైజాం సర్కరోడా.' అంటూ.. నిజాం నిరంకుశ పాలనపై తిరుగుబాటు బావుటా ఎగురవేసింది ఉమ్మడి జిల్లా. నిజాం నిరంకుశ పాలనలో జాగీర్దారులు, మక్తేదారులు, ఇనాందారులు, వతన్‌దారుల దుర్మార్గాలు, దౌర్జన్యాలపై వీరోచిత పోరాటం చేసింది. బాంచెన్ కాల్మొక్త అన్న సామాన్యుడే.. బందూక్‌తో గడి పునాదులను పెకలించాడు. ఈ పోరులో ప్రత్యేకంగా నిలిచింది మాత్రం హుస్నాబాద్ మండలంలోని మహ్మదాపూర్. తిమ్మాపూర్ మండలం పోలంపల్లికి చెందిన అనభేరి ప్రభాకర్‌రావు, రాజన్నసిరిసిల్ల జిల్లా లక్ష్మీపూర్‌కు చెందిన సింగిరెడ్డి భూపతిరెడ్డి దళాలు నిజాంకు వ్యతిరేకంగా చేసిన పోరు శ్లాఘనీయం. రజాకార్ల కాల్పుల్లో అనభేరి, భూపతిరెడ్డి అమరులయ్యారు. వీరితోపాటు మరో 10 మంది అమరులయ్యారు. వారి జ్ఞాపకార్థం మహ్మదాపూర్ గుట్టల్లో రెండు సమాధులు నిర్మించారు. ప్రతియేటా వారి వర్ధంతి రోజు సభలు నిర్వహిస్తూ వారి త్యాగాలను గుర్తు చేసుకుంటారు. ఎందరో మహానుభావులు తెలంగాణ సాయుధ పోరులో పాల్గొని ప్రాణాలను పణంగా పెట్టి చివరకు విజయం సాధించారు. వారి త్యాగాల ఫలితంగానే తెలంగాణకు విముక్తి లభించింది. నేడు తెలంగాణ విమోజన దినోత్సవం సందర్భంగా అలాంటి వారిని ఒక్కసారి మననం చేసుకుందాం..

- వివరాలు 2 లో▸

పంచాయతీల్లో అక్రమార్కులు

- పక్కదారి పడుతున్న నిధులు
- నకిలీ రశీదులతో పన్నులు వసూలు
- ఇళ్ల నిర్మాణాలకు లంచాలు
- అక్రమార్జనలో క్షేత్రస్థాయి సిబ్బంది



ముస్తాబాద్(సిరిసిల్ల): గ్రామపంచాయతీల్లో సిబ్బంది అక్రమార్జనకు అడ్డదారులు తొక్కుతున్నారు. నకిలీ రశీదు బుక్కులు ప్రింట్ చేసి వసూలు చేసిన పన్నులు పక్కదారి పట్టించిన వారు కొందరైతే.. ఇంటి నిర్మాణాలకు లంచాలు వసూలు చేస్తున్న వారు కొందరు.. పనికో రేటు అంటూ వసూళ్లకు పాల్పడుతున్న వారు మరికొందరు. ఇలా క్షేత్రస్థాయి సిబ్బంది పంచాయతీల ఆదాయానికి గండి కొడుతున్నారు.

నిధులు పక్కదారి

హరితహారం, జనరల్ ఫండ్, ఇళ్ల అనుమతులు, విరాసత్, పదహారో ప్రణాళిక సంఘం, ఎస్‌ఎఫ్‌సీ, జరిమానాలతో పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది. ఈ అంశాల్లోనే జిల్లాలో పలువురు అడ్డాదారుల్లో అక్రమార్జనకు పాల్పడుతున్నారు. పంచాయతీ పాలకవర్గం నిర్ణయాలకు తలొగ్గిన కొందరు కార్యదర్శులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే విషయం బహిరంగ రహస్యమే. నీటి సరఫరాలో మోటార్లు కాలిపోవడం, పైపులైన్ మరమ్మతులు, వీధిలైట్లు, హరితహారం మొక్కలు, ట్రాక్టర్లతో నీటి సరఫరా, ట్రాక్టర్ నిర్వహణలో డీజిల్, స్టేషనరీ వంటి అంశాలలో నిధులు పక్కదారి పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఇదంతా స్థానిక సంస్థల కనుసన్నల్లోనే నడుస్తున్నా బాధ్యులు మాత్రం పంచాయతీ కార్యదర్శులే అవుతున్నారు.

మచ్చుకు కొన్ని సంఘటనలు

- అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న డీఎల్‌పీవో మల్లికార్జున్ సస్పెండ్ అయ్యారు.
- కోనరావుపేట మండలం సుద్దాల కార్యదర్శి జగదీశ్వర్ ఇంటి అనుమతులకు రూ.20వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు.
- ఇల్లంతకుంట మండలం ఓబులాపూర్ కార్యదర్శి హరితహారం బిల్లుల్లో అవకతవకలకు పాల్పడ్డాడనే ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురయ్యాడు.
- ఇల్లంతకుంట మండలం అనంతగిరి ముంపు గ్రామంలో పంచాయతీ కార్యదర్శి నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల నిర్మాణాల అనుమతులు ఇచ్చాడనే ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురయ్యాడు.
- అనంతగిరిలో ఆర్‌అండ్‌ఆర్‌కాలనీ పంచాయతీ కార్యదర్శి సైతం ఇళ్ల అనుమతుల విషయంలో అవినీతికి పాల్పడ్డాడని సస్పెన్షన్ అయ్యారు.
- బోయినపల్లి మండలం తడగొండలో హరితహారం అమలులో పంచాయతీ కార్యదర్శి విమర్శలు ఎదుర్కొనగా.. అధికారులు సస్పెండ్ చేశారు.
- ముస్తాబాద్ మేజర్ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి ఎంపీవో అనుమతులు లేకుండా రశీదు బుక్కులు ప్రింట్ చేయించిన అంశంపై జిల్లా అధికారులు విచారణ చేపడుతున్నారు. ఇక్కడ కూడా ఇళ్ల అనుమతుల విషయంలో అవకతవకలు జరిగాయని పంచాయతీ పాలకవర్గం ఆరోపిస్తుంది.
- గంభీరావుపేట మేజర్ పంచాయతీలో ఇంటి అనుమతుల విషయంలో బిల్‌కలెక్టర్ మధును అధికారులు సస్పెండ్ చేశారు. లింగన్నపేట కార్యదర్శికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించగా.. ఆయనపై ఆరోపణలు రావడంతో డిప్యూటేషన్ రద్దు చేశారు.
- తంగళ్లపల్లి ఎంపీవో ఇంటి అనుమతుల విషయంలో విచారణ అధికారిగా ఉండి.. అక్రమాలకు పాల్పడ్డాడని కలెక్టర్ సస్పెండ్ చేశారు.
- ఎల్లారెడ్డిపేట పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ హరితహారంలో సరిగ్గా పనిచేయడం లేదని సస్పెండ్ చేశారు.

అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు



జిల్లాలో తొంభైశాతం గ్రామాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నాయి. ప్రభుత్వ పథకాలను సమర్థంగా అమలు చేయడం ద్వారా, జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డులు వస్తున్నాయి. కార్యదర్శుల పాత్ర లేనిదే ఇదంతా సాధ్యం కాదు. ఎవరైన నిబంధనలు విరుద్ధంగా పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నాం. విచారణ చేపడుతున్నాం.

– రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి

పెరుగుతున్న ఒత్తిడి

కార్యదర్శులు ఒత్తిడిలో పనిచేస్తున్నారు. చాలా మంది ఉదయమే గ్రామాలకు చేరుకుని రాత్రి వరకు పని చేస్తున్నారు. జిల్లాలో తొంభై శాతం గ్రామాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నా.. కొందరు కార్యదర్శులు అక్రమాలకు పాల్పడుతూ వ్యవస్థకే చెడ్డపేరు తెస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పల్లెప్రగతి, హరితహారం, ఉపాధిహామీ, పారిశుధ్యం, వీధిదీపాలు, నీటి సరఫరా, పన్నుల వసూళ్లు, క్రీడాప్రాంగణాలు, శ్మశానవాటికలు, ఇళ్ల అనుమతులు, సమావేశాలకు హాజరుకావడం, ప్రభుత్వ పథకాల అమలు, పండగల నిర్వహణ వంటి అంశాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈనేపథ్యంలో ఎక్కడ చిన్న తప్పు జరిగిన దానికి కార్యదర్శులే బాధ్యత వహించాల్సి వస్తోందని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు.

అదాలత్‌లో కేసులు సత్వర పరిష్కారం

- సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ



మాట్లాడుతున్న జడ్జి శ్రీలేఖ

సిరిసిల్లటౌన్: లోక్ అదాలత్‌లో కేసులు సత్వర పరిష్కారమవుతాయని సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయంలో శనివారం మండల న్యాయసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడారు. నిరుపేదలకు కోర్టులో రుసుం చెల్లించకుండానే ఉచిత న్యాయసేవలు అందుతాయని తెలిపారు. వృద్ధుల హక్కుల పరిరక్షణకు ఉన్న చట్టాల గురించి వివరించారు. బడీడు పిల్లలను చదివించాలని, వారిని పనిలో పెట్టుకుంటే కేసులు పెడతారని హెచ్చరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, న్యాయసేవా సమితి సభ్యుడు చింతోజు భాస్కర్, న్యాయవాదులు ఆడెపు వేణు, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు సన్మానం



అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డిని సన్మానిస్తున్న అరుణ

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బి.గౌతమ్‌రెడ్డిని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ దంపతులు శనివారం సన్మానించారు. జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంపు ఆఫీస్‌లో గౌతమ్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. జెడ్పీ సీఈవోగా ఉన్న గౌతమ్‌రెడ్డిని అదనపు కలెక్టర్ (ఎఫ్‌సీఏ)గా కలెక్టర్ అనురాగ్ జయంతి నియమించారు. తొలిసారి జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంపు ఆఫీస్‌కు వచ్చిన గౌతమ్‌రెడ్డిని సత్కరించారు. న్యాలకొండ రాఘవరెడ్డి ఉన్నారు.

జాతీయ సమైక్యత దినోత్సవానికి వినోద్‌కుమార్

- మంత్రి కేటీఆర్ స్థానంలో వినోద్‌కుమార్
- జీవో జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



వినోద్‌కుమార్

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించే జాతీయ సమైక్యత దినోత్సవానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రకటించింది. ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఆదివారం ఉదయం 9 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరణ, పోలీసు గౌరవ వందనం స్వీకరిస్తారు. ఈమేరకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. ఈ వేడుకలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారక రామారావు హాజరవుతారని ముందుగా ప్రభుత్వం ప్రకటించింది. ఆఖరి నిమిషంలో ముఖ్య అతిథిని మార్చడం చర్చనీయాంశమైంది.

మంత్రి కేటీఆర్ పర్యటన రద్దు

సిరిసిల్ల నియోజకవర్గంలో మంత్రి కేటీఆర్ ఆదివారం పర్యటిస్తారని ఆ పార్టీ ముఖ్యనాయకులు ముందుగా ప్రకటించారు. జాతీయ సమైక్యత వేడుకల్లో పాల్గొన్న అనంతరం మంత్రి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు. ఈమేరకు ఆయా గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. కానీ మంత్రి కేటీఆర్ ఆదివారం సిరిసిల్లకు రావడం లేదని, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ వస్తున్నారని తెలిసి బీఆర్‌ఎస్ శ్రేణులు నిరాశకు గురయ్యాయి. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ రద్దు అయినట్లు బీఆర్‌ఎస్ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

జాతీయ సమైక్యత వేడుకలకు కలెక్టరేట్ సిద్ధం

కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించే జాతీయ సమైక్యత వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఏర్పాట్లను శనివారం సాయంత్రం అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్ పరిశీలించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు జరిగే జాతీయ సమైక్యత వేడుకల్లో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించి, ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. ఆర్డీవోలు ఎస్.ఆనంద్‌కుమార్, మధుసూదన్ తదితరులు ఉన్నారు.

నిందితులకు శిక్ష తప్పదు

- ఎస్పీ అఖిల్ మహాజన్



ప్రశంసాపత్రాలు అందుకున్న కోర్టు ఆఫీసర్స్

సిరిసిల్లక్రైం: నేరాలకు పాల్పడిన వారికి శిక్ష పడడం ఖాయమని, శిక్షల శాతం పెరిగితేనే సమాజంలో మార్పు వస్తుందని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం కోర్టు డ్యూటీ ఆఫీసర్లతో సమావేశమయ్యారు. కోర్టు డ్యూటీ విధులు నిబద్ధతతో నిర్వహించిన పోలీసులకు ప్రశంసాపత్రాలు, రివార్డులు అందించారు. కోర్టు కేసులలో నేరస్తులకు శిక్ష పడితే ప్రజలకు పోలీసులపై నమ్మకం కలుగుతుందన్నారు. వివిధ కేసుల్లో శిక్ష పడేలా విధులు నిర్వహించిన సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కానిస్టేబుల్ మధుసూదన్, వేములవాడటౌన్ కోర్టు కానిస్టేబుల్ నరేశ్, ముస్తాబాద్ కోర్టు కానిస్టేబుల్ దేవేందర్, డీసీఆర్బీ కానిస్టేబుల్ అవినాశ్‌లను ఎస్పీ అభినందించారు.

ప్రకటనలు చూసి మోసపోవద్దు

వ్యాపారం పేరిట ప్రకటనలు వస్తే చూసి మోసపోవద్దని ఎస్పీ అఖిల్‌మహాజన్ ప్రకటనలో కోరారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. సైబర్ నేరాలకు గురైతే టోల్‌ఫ్రీ నంబర్లు 1930, డయల్ 100కు తక్షణమే కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇటీవల జిల్లాలో జరిగిన సైబర్ మోసాల సంఘటనలు వివరించారు.

మట్టి గణపతులను పూజిద్దాం

సిరిసిల్లటౌన్: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజిద్దామని ఎస్పీ అఖిల్‌మహాజన్ కోరారు. సిరిసిల్ల మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చింతోజు భాస్కర్ నేతృత్వంలో నిర్వహించిన మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

రుద్రంగి(వేములవాడ): హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, సంక్షేమ సహాయ అధికారి విజయలక్ష్మి సూచించారు. మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను శనివారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు రిజిష్టర్, స్టాక్ రిజిష్టర్, హాస్టల్ పరిసరాలు పరిశీలించారు.



మన పల్లెలు ఆదర్శం

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- జిల్లాలోని ఉత్తమ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు సన్మానం




ఎల్లారెడ్డిపేట సర్పంచ్ వెంకట్‌రెడ్డి, కార్యదర్శిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సిరిసిల్ల: జిల్లాలోని పల్లెలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం స్వచ్ఛసర్వేక్షణ్ గ్రామీణ్ –2023లో ఎంపికైన జిల్లాలోని 15 గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను సన్మానించారు. జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ మాట్లాడుతూ సర్పంచ్‌లు, వార్డుసభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు సమన్వయంతో పనిచేయడంతోనే జాతీయస్థాయిలో జిల్లాలోని పల్లెలకు గుర్తింపు దక్కిందన్నారు. ప్రతి ఊరికి ఒక్క పంచాయతీ కార్యదర్శిని నియమించి పల్లె పా లనను సీఎం కేసీఆర్ గాడిలో పెట్టారన్నారు. అదనపు కలెక్టర్ బి.గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయస్థాయిలో మన పల్లెలకు 13 అవార్డులు వచ్చాయని, ఇది తెలంగాణ సాధించిన ప్రగతికి నిదర్శనమని పేర్కొన్నా రు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, డీఆర్‌డీవో నక్క శ్రీనివాస్, డీపీవో రవీందర్, జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, స్వచ్ఛమిషన్ ఇన్‌చార్జి సురేశ్, అదనపు డీఆర్‌డీవో మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీలు ఇవే..

ఇల్లంతకుంట మండలం జంగంరెడ్డిపల్లె, ఎల్లారెడ్డిపేట, హరిదాస్‌నగర్, వేములవాడరూరల్ మండలం మర్రిపల్లి, వీర్నపల్లి మండలం వన్‌పల్లి, కోనరావుపేట మండలం మర్తన్‌పేట, నిజామాబాద్, తంగళ్లపల్లి, మండెపల్లి, చందుర్తి మండలం మల్యాల, వేములవాడఅర్బన్ మండలం రుద్రవరం, ముస్తాబాద్, నామాపూర్, గంభీరావుపేట, రుద్రంగి గ్రామాలు ఉత్తమ పంచాయతీలుగా ఎంపికయ్యాయి.

తుది జాబితా సిద్ధం చేయండి



సుదర్శన్‌రెడ్డి

సిరిసిల్ల: జిల్లాలో తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఎలక్ట్రోరల్ పరిశీలకులు సి.సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం ఓటర్ల నమోదుపై సమీక్షించారు. బీఎల్వోలతోపాటు రాజకీయ పార్టీల నేతలు తమ ఏజెంట్లను నియమించుకుని జాబితాను పరిశీలించి తప్పులుంటే ఎన్నికల అధికారులకు మెసేజ్ చేయాలన్నారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక ర్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. ఆగస్టు 21 నాటికి జిల్లాలో 4,46,243 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో పురుషులు 2,17,497, మహిళలు 2,28,730 మంది ఉన్నారని వివరించారు. అక్టోబరు 4న ఓటర్ల తుది జాబితాను వెల్లడించాలని సూచించారు. ప్రతీ బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్ పాల్గొన్నారు.



తిరగబడ్డ పోరుగడ్డ..!





- నేలకొరిగిన వందలాది మంది యోధులు
- పోరు చరిత్రలో ఉమ్మడి జిల్లాది ప్రముఖపాత్ర
- సాయుధ పోరాటానికి తలవంచిన నిరంకుశత్వం
- నేడు తెలంగాణ విమోచన (విముక్తి) దినోత్సవం

కరీంనగర్: 'బాంచెన్.. కాల్మొక్తాదొరా.. అన్నవారే భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఉమ్మడి జిల్లా తిరగబడింది. రజాకార్లను తరిమికొట్టింది. ఇక్కడి ప్రజలు ఎక్కడికక్కడ పలుగు, పార, చేతికి ఏది దొరికితే దాంతోనే పోరుబాట పట్టారు. సాయుధ గెరిల్లాలుగా, నాయకులుగా అగ్రభాగాన నిలిచారు.

తిరుగుబావుటా 'గాలిపెల్లి'

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండలం గాలిపెల్లికి తెలంగాణ సాయుధ పోరాటంలో వీరోచిత చరిత్ర ఉంది. నిజాం రాజ్యహింసకు ఒకేరోజు పదకొండు మంది ప్రాణాలర్పించిన ఆ నేల రక్త సింధూరమైంది. నిజాంకు వ్యతిరేకంగా పోరుచేస్తున్న బద్దం ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో నిజాం ఆధీనంలోని ప్రైవేటు సైన్యం రజాకార్లకు వ్యతిరేకంగా పల్లెలు తిరగబడ్డాయి. జనం కొడవళ్లు, గొడ్డళ్లు, బరిసెలు, గుల్లెర్లతో పోరుసాగించారు. నిజాం పోలీసులు, రజాకార్లపై తిరుగబడిన గాలిపెల్లిలో భీకరపోరు సాగింది. ఆ పోరులో గాలిపల్లితో పాటు సమీప గ్రామాలకు చెందిన పదకొండు మంది ఒకే రోజు అమరులయ్యారు. పీసు బక్కయ్య, బద్దం నారాయణ, బుర్రయ్య, పుల్లుగారి ఎల్లయ్య, అల్లెం వెంకయ్య, తాళ్లపల్లికి చెందిన సింగిరెడ్డి రాజిరెడ్డి, నర్సక్కపేటకు చెందిన ఎలేటి రాజిరెడ్డి, సోమారంపేటకు చెందిన ఐరెడ్డి భూంరెడ్డి, బెజ్జంకి మండలం బేగంపేటకు చెందిన తుమ్మోజి నారాయణ అమరులయ్యారు. రజాకార్ల దాడిలో బద్దం ఎల్లారెడ్డి, రాజలింగం, అమృత్‌లాల్‌శుక్లా తప్పించుకోవడంతో ఆగ్రహంతో రజాకారులు గాలిపెల్లిని తగులబెట్టారు.

సాయుధవీరులు అసువులు బాసిన నేల

తెలంగాణ విముక్తి కోసం.. నిజాం ప్రభుత్వ అరాచక పాలనను ఎదిరించిన సాయుధ పోరాటవీరులు.. హుస్నాబాద్ ప్రాంతానికి ఘనమైన చరిత్ర ఉంది. పోలంపల్లికి చెందిన అనభేరి ప్రభాకర్‌రావు, సిరిసిల్ల జిల్లా లక్ష్మీపూర్‌కు చెందిన సింగిరెడ్డి భూపతిరెడ్డి దళాలు రజాకార్లతో పోరుచేస్తూ మహ్మదాపూర్‌కు చేరుకున్నాయి. 14 మార్చి 1948లో మహ్మదాపూర్‌లో సమావేశం అయ్యారు. ఆ సమయంలో పోలీస్ పటేల్ వారిని భోజనానికి పిలిచి ఆ సమాచారాన్ని నిజాం ప్రభుత్వానికి తెలిపారు. రజాకార్లు గ్రామాన్ని చుట్టుముట్టి కాల్పులు జరపడంతో 12 మంది అమరులయ్యారు. వీరుల జ్ఞాపకార్థం అనభేరి ప్రభాకర్‌రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి పేరుతో రెండు సమాధులు నిర్మించారు. ప్రతియేటా వారి వర్ధంతి రోజు సభలు నిర్వహిస్తూ వారి త్యాగాలను గుర్తు చేసుకుంటారు.



సాయుధ దళాలు (ఫైల్)

రణభేరి మోగించిన 'అనభేరి'

అనభేరి ప్రభాకర్‌రావు.. 1910 ఆగస్టు 15న తిమ్మాపూర్ మండలం పొలంపెల్లి గ్రామంలో జమీందారి కుటుంబంలో జన్మించారు. సాయుధ పోరాటంలో తొలి దళ నాయకుడిగా తుపాకీ పట్టి పేదలకు బాసటగా నిలిచారు. రజకార్ల అకృత్యాలు, అరాచకాల నుంచి ప్రజలకు విముక్తి కలిగించాలనే లక్ష్యంతో జాగీర్‌దార్ వ్యవస్థకు వ్యతిరేకంగా విస్తృత ప్రచారం చేశారు. రజకార్లు, భూస్వాములకు వ్యతిరేకంగా దళాన్ని ఏర్పాటు చేసి నిజాం గుండెల్లో రైళ్లు పరుగెత్తించారు. చివరకు 1948 మార్చి 14న హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గుట్టల్లో నిజాం ప్రభుత్వం జరిపించిన కాల్పుల్లో అమరుడయ్యారు.



హుస్నాబాద్‌లో నెలకొల్పిన అనభేరి కాంస్య విగ్రహం(ఫైల్)

కొదురుపాక యోధులు



కేశవరావు (ఫైల్)



ఆనందరావు (ఫైల్)

బోయినపల్లి: రాజన్న సిరిసిల్ల బోయినపల్లి మండలం కొదురుపాకకు చెందిన జోగినిపల్లి కేశవరావు, మాన్వాడకు చెందిన జోగినిపల్లి ఆనందరావు ఆధ్వర్యంలో నైజాం, రజాకార్లకు వ్యతిరేకంగా ఉద్యమానికి తెరలేపారు. 1920లో జన్మించిన జోగినిపల్లి కేశవరావు.. వ్యవసాయంతోపాటు సోషల్ వర్క్ చేసేవారు. 1940లో సాయుధ దళాలకు ఆయుధాలు సమకూర్చేవారు. మహారాష్ట్ర చాందా, నాగ్‌పూర్ నుంచి ఆయుధాలు సేకరించి ఇక్కడి దళాలకు అందించేవారని చెబుతుంటారు. ఈ క్రమంలో మూడుసార్లు వరంగల్ జిల్లాలో జైలు జీవితం గడిపారు. కేశవరావుకు భార్య లక్ష్మికాంతమ్మ, కుమారుడు జోగినిపల్లి శ్రీనివాసరావు, కూతుళ్లు శోభమ్మ, శశికళ, స్వర్ణలత సంతానం. పెద్ద కుమార్తె శోభమ్మ ఇప్పటి సీఎం కేసీఆర్ భార్య.

ఆనందరావు పేరిట స్మారకస్తూపం

మాన్వాడకు చెందిన జోగినిపల్లి ఆనందరావు పేరు సాయుధపోరు చరిత్రలో నిలిచింది. 1921లో జన్మించిన ఆనందరావు బీఏ, ఎల్‌ఎల్‌బీ చేశారు. ఈయన తెలంగాణ పల్లెల్లో నిజాం ప్రభుత్వ ఆరాచకాలను జీర్ణించుకోలేదు. సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరులో చురుకుగా పాల్గొన్నాడు. మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వరరావుకు మేనమామ అయిన ఆనందరావు సిరిసిల్ల ప్రాంతంలో జరిగిన సాయుధ పోరులో కీలక పాత్ర పోషించారు. ఆరు నెలలు జైలు జీవితం గడిపారు. హైదరాబాద్ సంస్థానం విలీనం అయ్యాక ఆనందరావు సేవలకు ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధుడిగా గుర్తించి సత్కరించింది.


పోరులో 'చెన్నమనేని'



రాజేశ్వర్‌రావు (ఫైల్)

విద్యార్థి దశ నుంచే చెన్నమనేని ఉద్యమ సేనానిగా మారారు. అప్పటి విద్యార్థి సంఘం సిటీ కాలేజీ కార్యదర్శి రఫీ అహ్మద్‌తో 1947 ఆగస్టు 15న కళాశాలపై జెండా ఎగురవేయించారు. పోలీసుల నిర్బంధాన్ని ఎదుర్కొంటూనే మారువేశంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసిన యోధుడు. నిజాం పోలీసులు 3 అక్టోబర్ 1947 నుంచి ప్రీవెంటివ్ డిటెన్షన్ వారంట్ జారీచేయగా.. అజ్ఞాతంలో ఉంటూనే విలీనోద్యమంలో పాల్గొన్నారు. చంచల్‌గూడ, గుల్బర్గా జైలులో ఏడాది మగ్గారు.

కొరియర్‌గా 'దేశిని'



చినమల్లయ్య(ఫైల్)

చిగురుమామిడి మండలం బొమ్మనపల్లికి చెందిన దేశిని చిన మల్లయ్య అనభేరి ప్రభాకరరావు దళానికి కొరియర్‌గా పనిచేశారు. పరిసర గ్రామాల్లో తిరగడం.. వివరాలు సేకరించి, దళానికి చేరవేయడం ఈయన బాధ్యత. విలీనం తరువాత సీపీఐలో కొనసాగుతూ నాలుగు సార్లు సర్పంచ్, ఒకసారి సమితి ప్రెసిడెంట్, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా కొనసాగారు.

విద్యార్థిగానే జువ్వాడి గౌతంరావు పోరు



గౌతంరావు (ఫైల్)

విద్యార్థి దశలోనే స్వాతంత్ర్య ఉద్యమంలో చేరారు. విలీనోద్యమంలో పాల్గొని కరీంనగర్, వరంగల్ జైళ్లలో శిక్ష అనుభవించారు. 1947లో ఔరంగాబాద్ జైలు నుండి తప్పించుకొని వచ్చి మళ్లీ ఉద్యమంలో పాల్గొన్నారు. బద్దం ఎల్లారెడ్డి వంటి వీరుల మార్గదర్శకత్వంలో పనిచేశారు.

అజ్ఞాతంలో ఉంటూనే బోవెరా ఉద్యమం



వెంకటరామారావు(ఫైల్)

1947 అక్టోబర్ 2న అనేక గ్రామాల్లో గాంధీ జయంతి వేడుకలు జరిపిన యోధుడు. సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం కావాలని ఊరూరా ప్రచారం చేశారు. బెజ్జంకి గోదాం లూటీ చేయించడంలో కీలకపాత్ర పోషించారు. నిజాం పోలీసులు, రజాకార్లు తోటపల్లిలోని ఆయన ఇంటిపై దాడి చేసి ధ్వంసం చేశారు.

స్ఫూర్తి ప్రదాత.. బద్దం ఎల్లారెడ్డి

గాలిపెల్లికి చెందిన బద్దం హన్మంతరెడ్డి, లచ్చవ్వ దంపతులకు 1906లో జన్మించారు బద్దం ఎల్లారెడ్డి. యుక్త వయసులోనే కమ్యూనిజం భావజాలాన్ని ఒంట బట్టించుకున్నారు. గెరిల్లా దళాలకు మానాల క్యాంపులో శిక్షణ ఇచ్చారు. 1948 మార్చి 12న ఇల్లంతకుంట పోలీసు క్యాంపుపై దాడి చేసి ఎస్సైతో సహా ఆరుగురు పోలీసులను హతమార్చారు. పేదల అప్పు పత్రాలను పెత్తందార్ల నుంచి తెచ్చి ప్రజల సమక్షంలో కాల్చివేశారు. 1951లో జరిగిన తొలి ఎన్నికల్లోనే పీడీఎఫ్ అభ్యర్థిగా కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి బద్దం ఎల్లారెడ్డి విజయం సాధించారు. అప్పుడు ఆయన ప్రత్యర్థి పీవీ.నర్సింహరావు.



ఎల్లారెడ్డి (ఫైల్)

సామాన్యులే.. సాయుధులై

సిరిసిల్లకల్చరల్: సాయుధ పోరులో నిజాం వ్యతిరేక ఉద్యమకారులు తమ ప్రాణాలను పణంగా పెట్టారు. సింగిరెడ్డి భూపతిరెడ్డి లక్ష్మీపూర్ తాళ్లపల్లి ఆర్య సమాజ్, వందేమాతరం, స్టేట్ కాంగ్రెస్‌లో పనిచేశారు. రాత్రిపూట పాఠశాలల్లో విద్యను వ్యాప్తి చేశారు. రైతులకు జరిగే అన్యాయాలను ఎదిరించారు. నిజాం వ్యతిరేక సాయుధ పోరాటాలకు దిగారు. మహ్మదాపూర్ గుట్టల్లో అనభేరి ప్రభాకర్‌రావుతో కలిసి వీరమరణం పొందారు.

ఆంధ్ర మహాసభతో స్ఫూర్తి

1935 సెప్టెంబర్ 6న సిరిసిల్లలో నాలుగో ఆంధ్ర మహాసభను నిర్వహించారు. ఉపాధ్యాయుడు అమృతలాల్‌శుక్లా, మాడపాటి హన్మంతరావు అధ్యక్షత వహించిన ఈ సభలో బూర్గుల రామకృష్ణారావు, కేవీ.రంగారెడ్డి, జేవీ నర్సింగరావు, సురవరం ప్రతాపరెడ్డి, రావినారాయణరెడ్డి వంటి రాష్ట్రస్థాయి నాయకులు పాల్గొని స్ఫూర్తి రగిలించారు. వందలాది యువకులు, విద్యార్థులు ఉద్యమంలో పాల్గొన్నారు. కోడి రామకృష్ణ బల ప్రదర్శన ఈ సభకు ప్రత్యేక ఆకర్షణ అయింది. ఆంధ్ర మహాసభ కార్యకర్తలకు అన్నం పెడుతున్నారని బండపెల్లికి చెందిన గడ్డం రాఘవరెడ్డి ఇల్లును పోలీసులు లూటీ చేశారు. రుద్రంగి నర్సింగరావు, వై.హన్మంతరావు, అమృతలాల్‌శుక్లా తదితరులు సిరిసిల్ల, రుద్రంగి, లింగంపేట, సనుగుల, మల్యాల, ఎనుగంటి, బావుసాయిపేట, మామిడిపల్లి, కనగర్తి, హనుమాజీపేట, మల్లారం, మూడపల్లి, బాలరాజుపల్లి, నూకలమర్రి, మర్రిపెల్లి, నెమలికొండ గ్రామాల్లో జాతీయ జెండాలెత్తి ఉద్యమానికి ప్రజల్లో ఉత్తేజం కలిగించారు. చెన్నమనేని రాజేశ్వరరావు 1939లో ఏడో తరగతిలో ఉండగానే వందేమాతరం ఉద్యమంతో ప్రభావితుడయ్యారు. వీరికి స్వయానా బావ అయిన పొల్కంపల్లి వెంకటరామారావు ఆంధ్ర మహాసభ కరీంనగర్ జిల్లాకు అధ్యక్షులు. రాజేశ్వరరావు 1942లోనే స్కాలర్స్ డిబేటింగ్ సొసైటీ పేరుతో విద్యార్థి సంఘాన్ని ప్రారంభించారు. కోనరావుపేటకు చెందిన సీహెచ్.రాజలింగం రజాకర్ల క్యాంపుపై త్రివర్ణ పతాకం ఎత్తి పారిపోయాడు. మడుపు రాజిరెడ్డి, మర్రిగడ్డ సాయన్న తదితరులు నిర్బంధ లెవీ ధాన్యం వసూలుకు వ్యతిరేకంగా విలీనోద్యమంలో పాల్గొన్నారు.

కోరుట్ల కోట బురుజుల సాక్షిగా..

కోరుట్ల: కోరుట్ల కోట బురుజుల కిందిభాగంలో ఉన్న వాగు ఆనుకుని ఉన్న అవతలి ప్రదేశంలో రజాకార్ సైన్యం తిష్ట వేసిందన్న విషయం తెలుసుకున్న కస్తూరి ఎల్లప్ప ఆయన సహచరులు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. రాత్రి వేళ వాగుకు ఇవతల వైపు ఉన్న చెట్లకు దివిటీలు కట్టడంతోపాటు కొంత మంది దివిటీలు పట్టుకుని అటు..ఇటు తిరుగుతూ డప్పుల చప్పుళ్లు చేస్తూ ఇండియన్ మిలటరీ కోరుట్ల కోట బురుజుల సమీపంలో ఉన్నట్లు.. గ్రామస్తులు వారికి స్వాగతం పలుకుతున్న వాతావరణాన్ని సృష్టించారు. ఈ క్రమంలో వాగుకు అవతల వైపు ఉన్న రజాకార్ మూకలు ఇండియన్ మిలటరీలో ఓ భాగం కోరుట్లకు వచ్చి ఉంటుందన్న భయంతో అక్కడి నుంచి వెళ్లిపోయింది.



గొనె శంకర్

అప్పుడు నాకు పదహారేళ్లు: శంకర్, కోరుట్ల

కస్తూరి ఎల్లప్ప కోరుట్లలో ఆర్‌ఎస్‌ఎస్ శాఖ ప్రారంభించిన సమయంలో నాకు పదహారేళ్లు. నేను ఆర్‌ఎస్‌ఎస్ శిక్షణకు వెళ్లేవాడిని. రజాకార్లు వచ్చారని ఎల్లప్పతో పాటు కొంత మంది వాగు వెంబడి ఇండియన్ మిలటరీ ఉందన్న రీతిలో అలజడి చేశారు. దీంతో రజాకార్లు వెళ్లిపోవడంతో కోరుట్లకు భయం తప్పింది.

పోరుబాటలో గట్టెపల్లి బిడ్డ

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గట్టెపల్లికి చెందిన మురళీధర్‌రావు సాయుధ దళ సభ్యుడిగా ఉండి నిజాం రజాకార్లను ఎదుర్కొన్నారు. అనభేరి ప్రభాకర్‌రావుతో కలిసి రజాకార్లపై దాడులు చేశారు. 1943లో కమ్యూనిస్టులో చేరిన మురళి.. గొరెల్లి జమిందారి నర్సుబాయమ్మ దౌర్జన్యాలను ఎదిరించి విజయం సాధించారు. మహ్మదాపూర్ గుట్టలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మురళి గుట్టపై నుంచి దూకి తప్పించుకున్నారు. ప్రజల పక్షాన పోరాటం చేయడంతో మురళీపై పలు పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయి. అలుపెరగని పోరాటం చేసిన మురళీధర్‌రావు 1988 జూన్ 2న మృతిచెందారు.



మురళి (ఫైల్)

క్లుప్తంగా

రాజన్నకు మొక్కులు



వేములవాడ: రాజన్న ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. శ్రావణమాసం ముగిసిన కూడా భక్తులు తరలివస్తున్నారు. రాజన్న ఆలయానికి చేరుకున్న భక్తులు స్వామివారికి కోడెమొక్కులు చెల్లించారు.

విద్యార్థి గర్జనను విజయవంతం చేయాలి

కోనరావుపేట(వేములవాడ): బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అక్టోబర్ 6న నిర్వహిస్తున్న విద్యార్థి గర్జన సభను విజయవంతం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి అంగూరి రంజిత్ కోరారు. కోనరావుపేటలో శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. అజయ్, మల్యాల సుజిత్, భుక్యా అరవింద్, చైతన్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

సిరిసిల్లఅర్బన్: జిల్లా అథ్లెటిక్స్ అసోయేషన్ ఆధ్వర్యంలో ఖేలో ఇండియాలో భాగంగా బాలికలకు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు శనివారం నిర్వహించారు. ఈ పోటీలను ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ ప్రారంభించారు. పరుగుపందెం, షాట్‌పుట్, డిస్కస్‌త్రో పోటీల్లోని విజేతలుగా నిలిచిన 15 మంది క్రీడాకారులకు పతకాలు అందించారు. గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. సాయికృష్ణ, అజయ్‌కుమార్, నవీన్, బాబు, జ్యోష్ణ, పావని ఉన్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలం గజసింగవరం గ్రామానికి చెందిన సుతారి ఆంజనేయులు(41) శనివారం అప్పుల బాధతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆంజనేయులు ఇంటి పునర్‌నిర్మాణానికి, కూతురు వివాహానికి అప్పులు చేశాడు. కొన్ని నెలలుగా అప్పుల బాధతో తీవ్ర మానస్థాపానికి గురవుతున్నాడు. ఇటీవల ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. మృతుని భార్య జ్యోతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

అమృత్‌లాల్ శుక్లా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు కామ్రేడ్ అమృత్‌లాల్ శుక్లా విగ్రహాన్ని సిరిసిల్లలో ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్ కోరారు. తంగళ్లపల్లి మానేరువాగు సమీపంలోని కామ్రేడ్ అమృత్‌లాల్ శుక్లా స్థూపానికి సీపీఎం ఆధ్వర్యంలో శనివారం నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో జిల్లా నుంచి బద్దం ఎల్లారెడ్డి, సింగిరెడ్డి భూపతిరెడ్డి, అమృత్‌లాల్ శుక్లా, గడ్డం తిరుపతిరెడ్డి, కర్రోల్ల నర్సయ్య పోరాడారని గుర్తు చేసుకున్నారు. ఆదివారం బీవై నగర్ జెండా చౌరస్తా వద్ద నిర్వహించే బహిరంగసభకు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. తంగళ్లపల్లి మండల కార్యదర్శి కోడం రమణ, జిల్లా కమిటీ సభ్యులు సూరం పద్మ, మల్లారపు ప్రశాంత్, శ్రీరాముల రమేశ్‌చంద్ర, నర్సయ్య, మల్లయ్య, శ్రీనివాస్, రాకేశ్, సురేశ్, గంగాధర్, శంకర్, రాజమల్లు, పోచమల్లు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

సిరిసిల్లటౌన్: బీజేపీ ఓబీసీ మోర్చా సిరిసిల్ల అధ్యక్షుడు శ్రీగాధ మైసయ్య ఆధ్వర్యంలో శనివారం అంబేడ్కర్‌చౌరస్తాలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మైసయ్య మాట్లాడుతూ విశ్వకర్మ యోజన ద్వారా ఆయా సామాజిక వర్గాల కులవృత్తుల్లో నైపుణ్యం, మెరుగైన ఉపాధి కలిగించడం అభినందనీయమన్నారు. విశ్వకర్మ యోజనలో చేరిన వారికి ఉచిత శిక్షణ కాలంలో రోజుకు రూ.500 చొప్పున ఆర్థికసాయం, ఆధునిక యంత్రాల కొనుగోలుకు రూ.15వేలు ఇవ్వడం తోపాటు రెండు విడతల్లో రూ.2లక్షలు బ్యాంకు ద్వారా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఓబీసీ రాష్ట్ర కార్యాలయం కార్యదర్శి గౌడ వాసు, శ్రీనివాస్, గుండెల్లి వేణుగోపాల్, బీజేపీ పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, పార్లమెంట్ కోకన్వీనర్ ఆడెపు రవీందర్, విజయ్ పాల్గొన్నారు.

రైలు పట్టాలపై ప్రైవేట్ ఉపాధ్యాయుడి మృతదేహం



వరప్రసాద్‌శర్మ (ఫైల్)

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ రైల్వేస్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి మృతదేహం రైల్వే పట్టాలపై పడి ఉండగా శనివారం స్థానికులు గుర్తించి పోలీసులకు తెలిపారు. కరీంనగర్‌లోని మంకమ్మతోటకు చెందిన కామారపు వెంకటలక్ష్మి సుబ్రహ్మణ్య సీతారామాంజనేయ వరప్రసాద్‌శర్మ(54) ప్రైవేట్ ఉపాధ్యాయుడు. శనివారం ఉదయం కరీంనగర్ రైల్వేస్టేషన్ శివారులోని రైల్వే పట్టాలపై తల తెగిపోయి మొండెం కన్పించింది. రైల్వేపోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా ఆధారాలు లభించలేదు. శుక్రవారం రాత్రి కరీంనగర్ నుంచి కాచిగూడ వెళ్తున్న ప్యాసింజర్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోషల్ మీడియాలో మృతి సమాచారం రావడంతోకుటుంబసభ్యులు గుర్తించి రామగుండం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తిరుపతికి సమాచారం అందించారు. ఆదివారం పోస్టుమార్టం అనంతరం ప్రమాదమా, ఆత్మహత్య అనే విషయాన్ని నిర్ధారిస్తామని హెడ్‌కానిస్టేబల్ తెలిపారు.

వివాహేతర సంబంధాలతోనే హత్యలు

- డీఎస్పీ నాగేంద్రచారి
- మల్యాలలో యువకుడి హత్యకేసులో నిందితుడి అరెస్టు



లక్ష్మణ్‌ను అరెస్టు చూపుతున్న డీఎస్పీ, సీఐలు

వేములవాడ: వివాహేతర సంబంధాలు హత్యలకు దారితీస్తాయని, ఇలాంటి అలవాట్లు ఉన్న వాళ్లు వాటికి దూరంగా ఉండి, కుటుంబాలతో సంతోషంగా ఉండాలని డీఎస్పీ నాగేంద్రచారి కోరారు. మండలంలోని మల్యాలలో జరిగిన నరేశ్ హత్య కేసులో కొండూరి లక్ష్మణ్‌ను అరెస్టు చేసి వేములవాడలోని తన కార్యాలయంలో శనివారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఉపాధి కోసం గల్ఫ్ దేశం వెళ్లిన మల్లేశం తన భార్య రమతో నరేశ్ వివాహేతర వివాహేతర సంబంధం నెరుపుతున్న విషయాన్ని తమ సమీప బంధువు ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకున్నారన్నారు. దుబాయ్ నుంచి వచ్చి పథకం ప్రకారం హత్యచేశాడని తెలిపారు. హత్యకు సహకరించిన మల్యాలకు చెందిన లక్ష్మణ్‌ను మూడపల్లిలో అరెస్టు చేసినట్లు చెప్పారు. హత్య చేసిన వెంటనే మల్లేశం దుబాయ్‌కు పరారైనట్లు పేర్కొన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ద్వారా దుబాయ్ ప్రభుత్వానికి లేఖ రాసి, మల్లేశంను రప్పిస్తామన్నారు. నరేశ్ హత్యకు సహకరించిన వాళ్లను సైతం అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు. చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డబ్బు, మద్యం పంచకుండా గెలిచే సత్తా ఉందా?

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ

ముస్తాబాద్(సిరిసిల్ల): ఎన్నికల్లో డబ్బు, మద్యం పంచకుండా గెలిచే సత్తా బీఆర్‌ఎస్ పార్టీకి ఉందా ? అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ సవాల్ విసిరారు. మండలంలోని సేవాలాల్‌తండాలో బీజేపీ ఆధ్వర్యంలో టిఫిన్ బైఠక్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. బీజేపీ జెండాను ప్రతాప రామకృష్ణ ఆవిష్కరించి మాట్లాడారు. సిరిసిల్ల ఎమ్మెల్యే, మంత్రి కేటీఆర్ ఎన్నికల్లో డబ్బు, మద్యం పంచనని ప్రకటిస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, లగిశెట్టి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి గోపి, మండలాధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, క్రాంతి, కృష్ణ, శ్రీనివాస్‌రావు, మల్లారెడ్డి, యెల్ల గిరి, మెంగని మహేందర్ పాల్గొన్నారు.

మహిళా బిల్లు ప్రవేశపెట్టాలి

సిరిసిల్లటౌన్: పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం మహిళ, ఓబీసీ బిల్లులు ప్రవేశపెట్టాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ కోరారు. సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. గతంలో మహిళ, ఓబీసీ బిల్లులను రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే స్థానికసంస్థల్లో మహిళలకు యాభై శాతం రిజర్వేషన్ కల్పించిన ఏకైన వ్యక్తి అని కేసీఆర్ అని కొనియాడారు. టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, జిల్లా నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి, అడ్డగట్ల భాస్కర్, అబ్బాడి అనిల్ పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశపెట్టే దమ్ముందా?

వేములవాడ: పార్లమెంట్‌లో మహిళా, ఓబీసీ బిల్లులు ప్రవేశపెట్టి, ఆమోదింపజేసే దమ్ము బీజేపీ నాయకులకు ఉందా? అని బీఆర్‌ఎస్ వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు ప్రశ్నించారు. తన కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. పదేళ్లుగా రెండు బిల్లుల ఆమోదం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోరాడుతుంటే బీజేపీ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మహిళా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు అల్ఫోర్స్ విద్యార్థిని

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ– టెక్నో స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఎం.శ్రీహాసిని రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు శనివారం విద్యార్థిని పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా సైన్స్ మ్యూజియంలో ఎన్‌సీఈఆర్‌టీ హైదరాబాద్ వారు నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌లో శ్రీహాసిని విశేష పరిజ్ఞానాన్ని ప్రదర్శించి ప్రథమ బహుమతి గెలుపొందడంతో పాటు రాష్ట్రస్థాయికి ఎంపికవ్వడం సంతోషంగా ఉందన్నారు. ప్రాథమిక దశలోనే విద్యార్థులకు విద్యతో పాటు వివిధ అంశాల పట్ల ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రస్థాయిలో సత్తాచాటి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీహాసినిని అభినందిస్తున్న డా.నరేందర్‌రెడ్డి